

# పుస్తక పరిచయం




**Published by:**

**Navodaya Publishers**
**Karl Marx Road**
**VIJAYAWADA – 520 002**

**అమెరికాలోని** ప్రవాసాంధ్ర రచయితల్లో సొంతగొంతు, సొంత ముద్ర గల రచయితల్లో ఒకరు డొక్కా శ్రీనివాస ఫణికుమార్. రచన చదివి, రచయిత పేరు చెప్పించుకోగల  స్థాయి ఉన్న రచయిత. ఆయన రచనల సంకలనం ఈ 'పల్లకి'. ఈ 'పల్లకి'లో ఎక్కితే కోన సీమల వీథుల వెంట విహరిస్తాం. కొన్ని సార్లు 'డొక్కా' వారి కుటుంబ సభ్యులు మనల్ని పలకరిస్తారు. ఉన్నట్టుండి అదే 'పల్లకి'లో అమెరికా కూడా వచ్చేస్తాం. కడుపుబ్బా నవ్విస్తారు ప్రతి చోట, మనసు మెలితిప్పే సున్నితమైన సంఘటనలతో గుండె తడి చేస్తారు కొన్ని చోట్ల.

తమ రచనల్ని మూడు విభాగాలుగా పేర్చి అందించారు. మొదటి విభాగంలో చిన్ననాటి జ్ఞాపకాలని నవ్వుల పువ్వుల మధ్య పొదిగి మన ముందు ఉంచుతారు. నవ్విస్తూనే స్క్రీన్ ప్లే విధానంలో ఈ గల్పికలు వ్రాయడం..ఒక్క ఫణి గారికే సాధ్యమా అనిపిస్తుంది. ఇవి తన బాల్యానికి సంబంధించిన జ్ఞాపకాలే ఐనా, గతస్మృతుల్ని అనుభూతించగల ప్రతి వారికీ తమ బాల్యాన్ని గుర్తు తెస్తాయి. చిన్నప్పుడు బలపాన్ని ఆత్మీయంగా చూసుకుంటూ దాచుకున్న రోజులు, పరీక్షల్లో మార్కులకోసం పట్టిన కుస్తీలు, మార్కులు తక్కువైనప్పుడు ఇంట్లో 'రేవు'లో ఉతికించుకున్న సంఘటనలూ, మొదటిసారి కదిలే రైల్లో మనమూ పరిగెత్తే విచిత్రం... గుర్తు చేసుకోకుండా మీరు బ్రతికెయ్యగలుగుతున్నారంటే ఒక్కసారి ఈ పుస్తకంలోని 'బుడుగుడు కుంచం' గల్పికలు చదవండి.  చీకటి దుప్పట్లో దాక్కున్న మీ జ్ఞాపకాలని మనసు ముంగిట్లో గంతు లేయిస్తారు రచయిత.

కడుపుబ్బ నవ్వించే హాస్యం ఈయన రచనా జన్మహక్కు ఐతే, మానవీయ సంబంధాలలోని సున్నితమైన కోణాలని స్పృశించి, కళ్ళు చెమ్మగిల్లచేసే నేర్పు ఈయన చిరునామా. 'అమ్మ ఎంత పిచ్చిది! ఈ లోకమంతా అలాంటి పిచ్చి వాళ్ళతో నిండిపోతే ఎంత బాగుండును!?' "తాతగారిని చూస్తుంటే పూజలేని దేవుళ్ళని చూస్తున్నట్టనిపించేది.." , "జీవితం కథ ఐతే ఎంత బావుంటుందో కదూ కన్నా" అడిగాడు అతను, ఆమె తలనిమురుతూ..!! -ఇంతకంటే చెప్పాలా?

ఈ పుస్తకాన్ని తప్పక చదవండి మొదటినించీ చివరిదాకా. చదివి దాచుకోండి. దాచుకుని చదవండి. మీ జీవితంలో నవ్వులు జారిపోతున్నట్లనిపించినప్పుడు, సున్నితత్వం బండబారి పోతోందనిపించి నప్పుడు ఈ 'పల్లకి' లో ఎక్కండి. మళ్ళీ  మనకి మనం దొరుకుతాం.

***




TANA CONFERENCE SPECIAL ISSUE 2009

17వ తానా మహాసభల జ్ఞాపికగా ప్రచురించబడిన 'తెలుగు పలుకు' దాదాపు 300 పేజీల 'కలెక్టర్స్ ఎడిషన్'లా విడుదలైంది. గత నెలలో జరిగిన తానా మహాసభలకి హాజరైన వారందరికీ ఈ పుస్తకం ఉచితంగా ఇచ్చారు. ఐదు సంవత్సరాల పాటు ప్రతిష్ఠాత్మకంగా అమెరికా ఆంధ్రుల కోసం ప్రత్యేకంగా వెలువడిన 'తెలుగునాడి'కి సంపాదకత్వ బాధ్యతలు నిర్వహించిన చౌదరి జంపాల గారు, ఈ తానా ప్రత్యేక సంచికకి సంపాదకుడిగా వ్యవహరించారు. ఈ తానా సభల ప్రధాన నినాదం 'సాంకేతిక వికాసం- సాంస్కృతిక విన్యాసం'ని ప్రతిబింబించేలా ఈ సంచికని రూపొందించినట్లు చివరి మాటలో సంపాదకులు పేర్కొన్నారు. సంస్థాగత విశేషాలతో ఒక విభాగం, ప్రతిభా శతజయంతి, మారుతున్న ఆంధ్రావని, కళా సౌరభం, మన మాటల్లో అనే నాలుగు విభాగాలుగానూ ప్రచురణాంశాలని వర్గీకరించారు. ఇందులోని చాలా వ్యాసాలు రిఫరెన్స్ వ్యాసాల్లా అమూల్యంగా వున్నాయి. ముఖ్యంగా ప్రతిభా శతజయంతి విభాగంలో శ్రీశ్రీ, కొ.కు, గోపీచంద్, సుంకర వగైరా సాహితీ దిగ్గజాల గురించిన వ్యాసాలు ఎంతో అపురూపమైనవి. శ్రీశ్రీగారి గురించి వారి అబ్బాయి, గోపీచంద్‌గారి గురించి వారి అబ్బాయి వ్రాసిన వ్యాసాలు అరుదైనవి. వివిధ రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌లో వస్తున్న మార్పుల గురించిన వ్యాసాలు చాలా ఆసక్తికరంగా, విలువైన సమాచారంతో నిండి ఉన్నాయి. అలానే చిత్రకళ గురించి ఒక పాతిక పేజీల విశేషాలు అందించడం అభినందనీయం. ఈ సంచికలోని మరో ప్రత్యేకత - సృజనాత్మక రచనల విభాగంలో అందరూ అమెరికా ప్రవాసాంధ్ర రచయితల రచనలే ప్రచురించడం. సాధారణంగా ఇలాంటి అతి పెద్ద సావనీర్లు తయారు చేసేప్పుడు పేజీలు నింపడానికి ఆంధ్రదేశంలోని రచయితల మీద ఆధార పడడం సర్వ సాధారణం (ఇందులో తప్పేమీ లేదు కూడా) అలా కాకుండా కేవలం అమెరికా తెలుగు రచయితల రచనలతోనే 75 పేజీలని అలంకరించడం సాహసం. ఎంతో శ్రమకోర్చి దీన్ని విజయవంతంగా మనముందుకి తెచ్చిన సంపాదకులు, సంపాదక వర్గ సభ్యులూ, 'తానా' సంస్థ అందరూ అభినందనీయులే.

***

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

Editor, KOUMUDI(Web Monthly)
4251 Escudo Ct, Dublin, CA 94568,USA